AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
16-10-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

రెండేళ్లుగా బిల్లులు పెండింగ్..!







బీసీ తెలంగాణ బంద్‌కు మద్దతు..

## గిరిరాజ్ కళాశాలలో ఎకో బజార్

**అక్షరటుడే, ఇందూరు:** గిరిరాజ్ కళాశాలలో ఏర్పాటుచేసిన క్యాంపస్ ఎకో బజార్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి సూచించారు. ఎకో క్లబ్, తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ సంగీత ఆధ్వర్యంలో కళాశాలలో ఎకో బజార్ స్వదేశీ దీపావళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు స్వయంగా తయారుచేసే కొత్త రుచులను పరిచయం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎకో క్లబ్ సమన్వయకర్త నరేష్ కుమార్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రంగరత్నం, అకాడమిక్ కో-ఆర్డినేటర్ నహీదా బేగం, రాజేష్, దండు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## 21 నుంచి పోలీస్ అమరుల వారోత్సవ పోటీలు : ఎస్పీ రాజేష్ చంద్ర



**అక్షరటుడే, కామారెడ్డి:** పోలీస్ అమరుల వారోత్సవాల సందర్భంగా వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 21 నుంచి 31 వరకు జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ల పరిధిలోని అన్ని ఠాణాల్లో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన పోలీస్ అధికారులు విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసి ప్రజల భద్రతకు, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు విశేష సేవలు అందించారన్నారు. వారి త్యాగల ఫలితమే నేటి మన శాంతియుత భద్రతతో కూడిన సమాజమని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో విద్యార్థుల కోసం వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. అక్టోబర్ 21 నుంచి 28 వరకు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్రవిద్యార్థులు డ్రగ్స్ నుండి ఎలా దూరంగా ఉండాలనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 21న పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉదయం 8 గంటలకు అమరవీరుల దినోత్సవం, 22న కామారెడ్డి, 24 న ఎల్లారెడ్డి, 25 న బాన్సువాడ డివిజన్లలో అమరవీరుల కుటుంబాలకు పరామర్శ, 25న సైకిల్ ర్యాలీ, 27న కామారెడ్డి, 28న ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌లలో ప్రజా అవసరాల సేకరణ, 29న పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మెగా రక్తదాన శిబిరం, 30న ఓపెన్ హౌస్ కార్యక్రమం, 31న క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు.

## మెడికవర్ ఆస్పత్రిలో ప్రపంచ స్పైన్ డే




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ వెన్నుముక (స్పైన్) దినోత్సవం, అలాగే అనస్థీషియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి న్యూరోసర్జన్ కృష్ణాదిత్య మాట్లాడుతూ.. మారుతున్న ఆధునిక జీవనశైలితో చాలామంది వెన్నునొప్పితో బాధపడుతున్నారని అన్నారు. ఎక్కువసేపు కూర్చుని పనిచేయడం, మొబైల్, ల్యాప్‌టాప్‌ల అధిక వినియోగంతో మెడ, వెన్నునొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ అనస్థీషియా నిపుణులు వాను చేసిన కృషిని అభినందించారు.

## జూబ్లీహిల్స్‌లో జీవన్ రెడ్డి ప్రచారం



**అక్షరటుడే, ఆర్మూర్:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని నిజామాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. సునీతకు మద్దతుగా షేక్‌పేట్ డివిజన్ పరిధిలోని అఖింషా కాలనీ, మినీ బృందావన్ కాలనీలో ఆయన ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్ నగర అభివృద్ధికి కేసీఆర్ చేసిన కృషిని ఓటర్లకు గుర్తుచేశారు. రెండేళ్లలో వివిధ పథకాల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి ప్రజలకు బాకీపడ్డ డబ్బుల వివరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వాహిద్, షకీల్ అహ్మద్, అకీల్ అహ్మద్, ఖాలిక్ అహ్మద్, అమర్ అహ్మద్, సోయల్ హలీ, శ్రీధర్ చారి, భాస్కర్ నేత, శ్రీనివాస్, శ్రీకాంత్, రాజు, ఇమ్రాన్ ఖురేషి, మహమ్మద్ ఖలీల్, సంతోష్, గోపు రంజిత్, కిరణ్, పృథ్వీ, శ్రీకర్, సైఫ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయి. పేదలకు ఉపాధి కల్పించడానికి కేంద్రం అమలు చేస్తున్న ఈ పథకంలో కొందరు అవినీతికి పాల్పడుతున్నారు. సామాజిక తనిఖీల్లో ఈ అక్రమాలు బయట పడుతున్నా.. సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. నిధులను రికవరీ చేయడం లేదు. దీంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు.

\- అక్షరటుడే, భీమ్‌గల్

# కొండంత అక్రమం.. గోరంత స్వాధీనం

- గత ఐదేళ్లలో రూ.6.57 కోట్ల ఉపాధి నిధులు దుర్వినియోగం
- సామాజిక తనిఖీల్లో వెలుగు చూస్తున్న అవినీతి
- రికవరీ చేయడంలో అధికారుల నిర్లక్ష్యం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు వరంగా మారింది. క్షేత్రస్థాయి అధికారుల నుంచి మొదలుకొని మండల స్థాయి అధికారుల వరకు అందిన కాడికి దండుకుంటున్నారు. ఉపాధి హామీ అక్రమాలను గుర్తించినా.. అవినీతి సొమ్మును తిరిగి రాబట్టడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో ఏటా కోట్ల రూపాయల మేర ఆర్థిక లోటుపాట్లు, నిధుల దుర్వినియోగం జరుగుతున్నట్లు సామాజిక తనిఖీ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

### రూ.14 లక్షలే రికవరీ

ప్రతి ఏడాది సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి ఉపాధి హామీ పనులను తనిఖీ చేస్తుంది. లబ్ధిదారుల నుంచి వివరాలను తెలుసుకొని గ్రామసభ నిర్వహించి జరిగిన అక్రమాలను వెల్లడిస్తారు. అలాగే మండల సభలో గ్రామాల వారీగా జరిగిన అవినీతిని వెల్లడిస్తూ నివేదికను జిల్లా ఉపాధి హామీ అధికారులకు అందజేస్తారు. గత ఐదేళ్లలో నిజామాబాద్ జిల్లాలో రూ.6,57,08,404 కోట్ల నిధులు దుర్వినియోగం అయినట్లు అధికారులు గుర్తించారు. అయితే ఇప్పటి వరకు రూ.14.64 లక్షల సొమ్ము మాత్రమే రికవరీ చేశారు.

### 471 మంది అధికారులకు జరిమానా

గత ఐదేళ్లలో 471 మంది అధికారులకు రూ.33.61 లక్షల జరిమానా విధించారు. అవినీతి సొమ్ము రికవరీ కోసం రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించాల్సిన అధికారులు "మామూలు"గా వ్యవహరిస్తున్నారు. ఆర్థిక లోటుపాట్లు జరిగినట్లు అధికారులు అంగీకరిస్తున్నా.. రికవరీ అవుతున్న నిధులు 2 శాతం కూడా దాటడం లేదు. రాజకీయ ఒత్తిళ్లు, అధికారుల ఉదాసీనతతో అవినీతి సొమ్ము రికవరీ కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జరిమానాలు విధించిన తర్వాత నిధులు తిరిగి చెల్లించడానికి మూడు నుంచి నాలుగు నెలల సమయం ఇవ్వాలనే నిబంధనను చాలా మంది దుర్వినియోగం చేస్తున్నారు. అలాగే అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం లేదు.

### ప్రజాధనం వృథా

ఉపాధి హామీ పథకం నిధుల దుర్వినియోగం, దానిపై అధికారుల నిమ్మకు నీరెత్తిన వైఖరి కారణంగా కోట్లాది రూపాయల ప్రజాధనం పక్కదారి పడుతోంది. పేదలకు ఉపాధి కల్పించి, గ్రామీణాభివృద్ధిని సాధించాలనే ఈ పథకం లక్ష్యం అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణంగా నీరుగారి పోతుందని పలువురు అంటున్నారు. దుర్వినియోగమైన నిధులను కఠినంగా రికవరీ చేయడంతో పాటు, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఈ పథకం పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుంది.

## పాఠశాలను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



**అక్షరటుడే, బోధన్:** మండలంలోని ఊట్‌పల్లి ప్రాథమిక పాఠశాలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. అదేవిధంగా విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను పెంచాలని ఉపాధ్యాయులతో పేర్కొన్నారు.

## ఆలయాలను పరిశీలించిన టీటీడీ అధికారులు



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూరు మండలంలోని దేగాం, మిర్దపల్లిలోని ఆలయాలను గురువారం తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు పరిశీలించారు. మిర్దపల్లి గ్రామంలో నూతన మందిరాల నిర్మాణం, దేగాం గ్రామంలో శ్రీ లక్ష్మీ నారాయణ మందిరాన్ని పరిశీలించారు. లక్ష్మీ నారాయణ మందిరం శిథిలావస్థకు చేరుకోగా మరమ్మతుల నిమిత్తం టీటీడీ పాలకమండిని లేఖద్వారా విన్నవించగా అధికారులు స్పందించి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మూడు మందిరాల నివేదికలను తయారుచేసి టీటీడీ పాలకమండలికి అందించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మగ్గిడి విద్యార్థినులు




**అక్షరటుడే, ఆర్మూర్:** రాష్ట్రస్థాయి అండర్ 17 వాలీబాల్ పోటీలకు ఆర్మూర్ మండలం మగ్గిడి ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం హరిత పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థినులను ఆమె అభినందించారు. ఈనెల 18 నుంచి 20 వరకు మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌లో స్టేట్ లెవల్ వాలీబాల్ టోర్నీ జరుగనుందన్నారు. విద్యార్థినులను వ్యాయామ ఉపాధ్యాయుడు మధు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

## సీపీ కార్యాలయాన్ని ముట్టడించిన కాంగ్రెస్ నాయకులు



**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీపీ కార్యాలయాన్ని ముట్టడించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు గురువారం తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ తన సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కించపర్చే విధంగా పోస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తిని కేటీఆర్‌తో పాటు ఆయన సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలకు నిరసిస్తూ పోలీస్ కమిషనర్ సాయిచైతన్యకు వినతిపత్రం అందజేశామన్నారు. మాజీమంత్రి కేటీఆర్‌పై కఠినమైన సెక్షన్ల కింద కేసును నమోదు చేయాలని బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని విద్యార్థులు, యువత మనోభావాలను దెబ్బతీసే విధంగా కేటీఆర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారని దీనికి పూర్తి బాధ్యత కేటీఆర్ వహించాలన్నారు. జిల్లాలో పోలీసులు కాంగ్రెస్ నాయకులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేటీఆర్‌పై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రంలోని విద్యార్థులు, యువత పెద్దఎత్తున ఆందోళనకు సిద్ధమవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు తాహెర్ బిన్ హందాన్, గడుగు గంగాధర్, రత్నాకర్, వేణురాజ్, విపుల్ పాల్గొన్నారు.



## వాహనాల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్ : సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులతో పాటు వాటిని కొనుగోలు చేసిన మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీపీ సాయి చైతన్య తెలిపారు. నగరంలోని క్రైం బ్రాంచ్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కొంతమంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి బోధన్, నిజామాబాద్, ఆర్మూర్, ముధోల్ ప్రాంతాల్లో ఆటోలు, బైక్‌లు చోరీ చేసి కోరుట్ల, జగిత్యాల్ ప్రాంతాల్లో అమ్ముతున్నారనే పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. నగరంలోని ఆటోనగర్‌కు చెందిన షేక్ ఫజిల్ (25), మహమ్మద్ నవాజ్ (23)ను అదుపులోకి తీసుకొని విచారించగా నిజామాబాద్‌కు చెందిన షేక్ అలీ, హలీం, వాయి కలిసి 9 ఆటోలు మూడు బైక్‌లను చోరీ చేశారని ఒప్పుకున్నారు. చోరీ చేసిన వాహనాల సెంటర్ ప్లేట్లను మార్చి వాటిని కోరుట్లలోని మహమ్మద్ ఇమ్రాన్, మహమ్మద్‌లకు అమ్మేవారని తెలుపగా వారిని సైతం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఒక ఆటో రికవరీ చేసి వారిచ్చిన సమాచారం మేరకు వారి వద్ద నుంచి 9 ఆటోలు 3 బైక్‌లు రికవరీ చేశారు. రికవరీ చేసిన దొంగ వాహనాలను పరిశీలించగా నాలుగు ఆటోలు మూడు బైక్‌ల సమాచారం లభించింది. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. కొనుగోలు చేసిన వాహనాలను తర్వాత అమ్ముకుందామని బోధన్‌లోని శక్కర్‌నగర్ రైల్వేస్టేషన్ దగ్గర నిర్మానుష్య ప్రదేశంలో దాచిపెట్టారు. ఈ వాహనాలను పోలీసులు సీజ్ చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: మానాల

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సహకార యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి సూచించారు. మండలంలోని అమీర్ నగర్‌లో, నర్సాపూర్ ఐకేపీ సెంటర్, కోన సముందర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మానాల మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య వైస్ ఛైర్మన్ సుంకెట బుచ్చన్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, ఏఎంసీ డైరెక్టర్ జైడి మధులత, శ్రీనివాస్ రాములు నాయక్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్, గోపిడి లింగారెడ్డి, నూకల బుచ్చి మల్లయ్య, కొమ్ముల రాజేందర్, భూమారెడ్డి, గంగారెడ్డి, పుప్పాల నర్సయ్య, సంజీవ్, గణేష్, రాకేష్, సామ మహేందర్, సామ భూమారెడ్డి, చెంగల అశోక్ పాల్గొన్నారు.






## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి: బస్వా

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వా లక్ష్మీ నర్సయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 8 వేలకు పైగా కొనుగోలు కేంద్రాల అవసరం ఉంటే ఇప్పటివరకు కేవలం 1,492 మాత్రమే ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో పంట చేతికి వచ్చింన్నారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం రైతులకు అండగా నిలవడం లేదన్నారు. పలు జిల్లాల్లో అకాల వర్షాలతో నష్టాలు వాటిల్లితే, మద్దతు ధర ఇవ్వలేదని ఆరోపించారు. చాలా జిల్లాల్లో రైతులు తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్ముకునే పరిస్థితి నెలకొందన్నారు. రూ.500 బోనస్ కూడా ఒకే పంటకు ఇచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తిత్వం మాత్రమే వహిస్తుందని గుర్తు చేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తామే కొంటున్నట్లు రైతులను మభ్యపెడుతుందన్నారు. బీసీ రిజర్వేషన్లపై కావాలని రాష్ట్ర ప్రభుత్వం రాద్ధాంతం సృష్టిస్తుందన్నారు. సుప్రీంకోర్టు లో కూడా చుక్కదురైందని, అది ప్రభుత్వానికి ముందే తెలుసన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనకర్ లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, తదితరులు పాల్గొన్నారు.



## నూతన సబ్‌స్టేషన్ పనులు ప్రారంభం

**అక్షరటుడే, బోధన్:** సాలూర మండలం జాడిజమాల్‌పూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న 33/11 కేవీ సబ్ స్టేషన్ పనులను గురువారం ప్రారంభించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ముగ్గువేసి పనులను మొదలుపెట్టారు. కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ ఏడీఈ తోట రాజశేఖర్, బోధన్ ఆపరేషన్స్ ఏ డీఈ నగేష్ కుమార్, కన్‌స్ట్రక్షన్స్ ఏఈ సుమిత, బోధన్ ఆపరేషన్స్ టౌన్-2 ఏఈ కళ్యాణ్, సివిల్ కార్తీక్, గ్రామస్థులు సుందర్ రాజు, శ్రీనివాసరావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



## జలాల్‌పూర్‌లో పశువైద్య శిబిరం

**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని జలాల్‌పూర్‌లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్య సిబ్బంది గ్రామంలోని 215 పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం పశు సంవర్ధక శాఖ ఏడీ గంగాధరయ్య మాట్లాడుతూ.. మూడునెలలు నిండిన ఆవులు, గేదెలు, ఎడ్లకు పశు పోషకులు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. అలాగే పశువుల పెంపకంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది ప్రవీణ్, గోపాలమిత్ర ప్రణీత్, మల్లేష్, షకీల్, బషీర్, గ్రామస్థులు మల్కన్న, గంగారాం, కత్తి గంగారాం, చిత్తపురం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని ఎల్లారెడ్డి పల్లి గ్రామంలో గురువారం గేదెలు, ఆవులు, దూడలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. 150 ఆవులు, 200 గేదెలు, దూడలకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి గంగాప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, పశు వైద్య సిబ్బంది, రాజు, తిరుపతి, బాల గంగారం, సుజాత, పోశెట్టి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగులకు అండగా భవిత కేంద్రాలు

**అక్షరటుడే, బాల్కొండ:** దివ్యాంగుల కోసం భవిత కేంద్రాలు అండగా నిలుస్తున్నాయని ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. బాల్కొండ మండల కేంద్రంలోని భవిత్ సెంటర్‌లో విద్యార్థులకు చేస్తున్న ఫిజియోథెరపీని పరిశీలించారు. శారీరక వైకల్యంతో బాధపడుతున్న వారికి వారంలో సోమ, గురువారాల్లో ఉచితంగా ఫిజియోథెరపీ చికిత్స అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమం లో ఫిజియోథెరపిస్ట్ అఖిల, ఐఆర్పీ రాజ నర్సయ్య పాల్గొన్నారు.

## వ్యక్తి దారుణహత్య..

**అక్షరటుడే, గాంధారి:** గాంధారి మండలంలోని చద్మల్‌కు వెళ్లే శివారులో గుంతలో ఓ వ్యక్తిని పెట్రోల్ పోసి నిప్పటించి హత్య చేసినట్లు స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి డీఎస్పీ శ్రీనివాస్, సదాశివనగర్ సీఐ సంతోష్ కమార్, ఎస్సై ఆంజనేయులు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కామారెడ్డి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన చేశారు. మృతుడి వయస్సు 30 ఏళ్లు ఉంటుందని.. సమాచారం నిమిత్తం గాంధారి పోలీస్‌స్టేషన్‌లో 8712686165 నంబర్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

## డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు మోపాల్ ఎస్సై సుస్మిత తెలిపారు. మండలంలోని కులాస్‌పూర్‌కు చెందిన గణేష్, సిరిపూర్‌కు చెందిన మహిపాల్ ఇటీవల డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి, గురువారం జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చినట్లు చెప్పారు. దీంతో విచారించిన న్యాయస్థానం నిందితులిద్దరికి నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వెల్లడించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాన్సువాడ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవడంతో, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో బిల్లులు వస్తాయో.. లేదోనన్న భయంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. – అక్షరటుడే, బాన్సువాడ



# రెండేళ్లుగా బిల్లులు పెండింగ్..!

■ నిధులు విడుదల కాక నిలిచిన అభివృద్ధి పనులు ■ రూ.60 కోట్లు బకాయిలు, మరో రూ.15 కోట్లు వెనక్కి

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు పూర్తయినా.. ఇప్పటికీ బిల్లులు మంజూరు కావడం లేదు. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో రెండేళ్లుగా అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఒకప్పుడు బాన్సువాడ నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయినేజీలు, భవన నిర్మాణాలు, చెరువుల పునరుద్ధరణ వంటి రూ.వందల కోట్ల అభివృద్ధి పనులు వేగంగా జరిగాయి. కానీ కొత్త ప్రభుత్వం వచ్చాక చాలా పనులకు సంబంధించి నిధులు రాకపోవడంతో అన్ని ప్రాజెక్టులు నిలిచిపోయాయి.

బిల్లులు రాకపోవడంతో, కాంట్రాక్టర్లు బ్యాంకు రుణాలు, అప్పులతో తంటాలు పడుతున్నారు. కొందరు కాంట్రాక్టర్లు బిల్లులు వస్తాయన్న ఆశతో పనులు పూర్తిచేసినా, చెల్లింపులు రాక ఆర్థికంగా కుంగిపోతున్నారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లిస్తే కాంట్రాక్టర్లు తిరిగి పనులు ప్రారంభించే అవకాశం ఉంటుందని, లేకపోతే భవిష్యత్తులో అభివృద్ధి పనులకు అడ్డంకులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని అంటున్నారు.



### రూ. 60 కోట్ల బకాయిలు..

గత ప్రభుత్వ హయాంలో బాన్సువాడ నియోజకవర్గంలో రూ. 60 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. బీర్కూర్ మండల కేంద్రంలో రూ. 5 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు చేపట్టారు. మోస్రా మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టి రెండేళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ నిధులు విడుదల కాలేదు. నస్రుల్లాబాద్ మండలం అంకోల్ - సంగెం రోడ్డు రూ.4 కోట్లతో నిర్మించినా బిల్లులు రాలేవు. కోటగిరి మండలం సుంకిని -బోధన్ రోడ్డు నిధులు ఇప్పటికీ విడుదల కాలేదు. నిధులు విడుదల కాకపోవడంతో మోస్రా అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి.

### వెనక్కి వెళ్లిన రూ.15 కోట్ల నిధులు..


రెండేళ్లుగా చేసిన పనులకు నిధులు విడుదల కాలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నూతనంగా బాన్సువాడ నియోజకవర్గంలో బాన్సువాడ, నస్రుల్లాబాద్‌లలో రూ. 15 కోట్ల పనులు మంజూరయ్యాయి. పాత నిధులు విడుదల కాకపోవడంతో కొత్త పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. దీంతో రూ.15 కోట్ల నిధులు వెనక్కి వెళ్లినట్లు పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు.



## వేతన బకాయిలు చెల్లించాలని కార్మికుల ఆందోళన

**అక్షరటుడే, బాన్సువాడ:** పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆస్పత్రిలోని సానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు గురువారం ఆస్పత్రి ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. నాలుగు నెలలుగా వేతనాలు బకాయి చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దసరా, దీపావళి పండుగల వేళ కుటుంబాలను పోషించడం కూడా కష్టంగా మారిందని, అప్పులు చేసి రోజువారీ ఖర్చులు వెళ్లదీసుకుంటున్నామని వారు తెలిపారు. మాకు వేతనాలు ఇవ్వకపోతే విధులు ఎలా నిర్వహించగలమని కార్మికులు ప్రశ్నించారు. ప్రభుత్వం, కాంట్రాక్ట్ ఏజెన్సీ తక్షణమే బకాయిలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## బాధితుడికి ఎల్‌వోసీ అందజేత



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండల కేంద్రానికి చెందిన భూక్య మహిపాల్ సీఎం సహాయనిధి నుంచి రూ. 2.50 లక్షల ఎల్వోసీని అందుకున్నాడు. అత్యవసర చికిత్స నిమిత్తం మహిపాల్ హైదరాబాద్ లోని నిమ్స్‌లో చేరాడు. పరీక్షల అనంతరం వైద్యులు ఆపరేషన్ చేయాలని సూచించగా సాయం కోసం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్‌ను సంప్రదించాడు. దీనికి స్పందించిన ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ. 2.50లక్షల ఎల్‌వోసీ అందజేశారు. ఆపద సమయంలో ఆదుకున్న ముత్యాల సునీల్ కుమార్‌కు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపాడు.



బీసీ బంద్‌కు మద్దతు ప్రకటిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్..



తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో..



బోధన్‌లో..

## బీసీ తెలంగాణ బంద్‌కు మద్దతు..

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు అన్నివర్గాలు మద్దతు తెలుపుతున్నాయి. వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఇప్పటికే బంద్‌కు మద్దతిస్తూ తీర్మానాలు చేశారు. బీసీలకు కల్పించే రిజర్వేషన్లను కొన్ని అగ్రవర్ణాలు అడ్డుకోవడాన్ని ఖండిస్తూ బీసీ సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. – అక్షరటుడే, నెట్‌వర్క్




నిజామాబాద్‌లో..



నిజామాబాద్‌లోని పద్మశాలి సంఘంలో..

## ఖాళీ ప్లాట్లు, ఇళ్లకు వేలంపాట

**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ డివిజన్‌లోని ఖాళీప్లాట్లు, ఇళ్లకు వేలంపాట నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్‌లో ఉన్న ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కమర్షియల్ ప్లాట్లకు రూ. 5 లక్షలు, ఓపెన్ ప్లాట్లు, ఇళ్లకు రూ.2లక్షల డిపాజిట్ తీసుకొని వేలంపాటలో పాల్గొనేందుకు అనుమతించారు. మొత్తం 18 స్థలాలు ఇళ్లకు ఆక్షన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విమల, అంకం రావు, ఏఈవో భాస్కర్, పీఆర్వో వాసు, వర్క్ ఇన్‌స్పెక్టర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.






## డాక్టర్ బాపురెడ్డి వర్ధంతి సందర్భంగా అన్నదానం

**అక్షరటుడే, బాన్సువాడ:** విద్యార్థి దశ నుంచే తెలంగాణ కోసం పోరాడిన నేత డాక్టర్ బాపురెడ్డి వర్ధంతిని బాన్సువాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సందర్భంగా ఫోరం సభ్యులు మాట్లాడుతూ.. బాపురెడ్డి తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన త్యాగాలు, సేవలు ఎప్పటికీ మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులు గంగాధర్ గుప్తా, దండు విజయ్, గంజివార్ చందు, భాస్కర్ గౌడ్, కాల్వ శ్యామ్, రాజు, కృష్ణ, గంగారాం, హన్మాండ్లు, బాబుసిందే, నార్ల రత్న కుమార్ పాల్గొన్నారు.



## కల్లెడిలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలంలోని కల్లెడిలో మాక్లూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం సొసైటీ ఛైర్మన్ బురోళ్ల అశోక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ అశోక్ మాట్లాడుతూ రైతులు కేంద్రాలకు తగిన తేమ శాతం కలిగిన, స్వచ్ఛమైన ధాన్యాన్ని మాత్రమే తీసుకురావాలని సూచించారు. దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయం జరిపితే రైతులకు నష్టాలు తప్పుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మహేష్, రమేష్, అనివాష్, భాస్కర్, నర్సారెడ్డి, బుజ్జి, బాలరాజ్‌తో పాటు సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.




## కామారెడ్డి ఐఎంఏకు ఆల్ రౌండ్ బెస్ట్ బ్రాంచ్ అవార్డ్

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి ఐఎంఏకు ఆల్ రౌండ్ బెస్ట్ బ్రాంచ్ అవార్డు లభించిందని ఐఎంఏ జిల్లా కార్యదర్శి డాక్టర్ అరవింద్ కుమార్ గౌడ్ తెలిపారు. తాము బహుళ రంగాల్లో రాణించామని అందుకే ఈ అవార్డు లభించిందని తెలిపారు. సీపీడీ కార్యక్రమాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బాలికా దినోత్సవం, అగ్నిమాపక భద్రతా అవగాహనతో సహా అవగాహన ప్రచారాలు నిర్వహించామని పేర్కొన్నారు. సంక్షోభ నిర్వహణ - ఆస్పత్రి అవాంతరాలు, రోగివైద్యుల సంఘర్షణల సమయంలో సమస్యలను పరిష్కరించడం, ఆరోగ్య సంరక్షణ సమస్యలపై కాలుష్య బోర్డుతో చురుకుగా పాల్గొనడం జరిగిందన్నారు.



## కారును ఢీకొన్న బస్సు..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. గురువారం ఉదయం ఓ కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. నిజామాబాద్ వైపు వెళ్తున్న బస్సును ఓ కారు నడుపుతున్న వ్యక్తి ఓవర్ టేక్ చేయబోయాడు. అయితే, కారు డ్రైవర్ లెఫ్ట్ సైడ్ నుంచి బస్సును దాటే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో బస్సును ఆర్టీసీ డ్రైవర్ లెఫ్ట్ సైడ్‌కు తిప్పడంతో ఈ ప్రమాదం సంభించింది. ఈ ఘటనలో కారు స్వల్పంగా ధ్వంసమైంది. అందులో ప్రయాణిస్తువారిలో ఎవరూ గాయపడలేదు. ట్రాఫిక్ కానిస్టేబుళ్లు శంకర్, రాములు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.